
సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
బుధవారం । 5 । జూలై । 2023



డెల్టాలకు 8,105 క్యూసెక్కులు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి డెల్టా కాలువలకు మంగళవారం 8,105 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,250, మధ్య డెల్టాకు 1,615, పశ్చిమ డెల్టాకు 4,240 క్యూసెక్కులు వదిలారు.



విచ్చుకోనున్న పచ్చదనం

నగర నడిమధ్యలో దాదాపు 70 ఎకరాలకు పైబడి ఉన్న జేఎన్‌టీయూ కాకినాడ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణ నేడు పర్యావరణ ప్రాజెక్టుకు పునాదిగా మారుతోంది.

8లో

గరిష్టం/కనిష్టం
35.5° / 26.0°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	35.5	26.0
కాకినాడ	33.0	25.0
అమలాపురం	34.0	27.0

న్యూస్‌రీల్

అల్లూరి ఒక మహోజ్వల శక్తి
కలెక్టర్ హిమాన్షు శుక్లా



అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ శుక్లా, ఎస్పీ శ్రీధర్ తదితరులు

అమలాపురం రూరల్: భారత స్వాతంత్ర యోద్యమ చరిత్రలో అల్లూరి సీతారామరాజు ఒక మహోజ్వల శక్తి అని, ఆయన జరిపిన సాయుధ పోరాటం స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రత్యేక అధ్యాయమని, సాయుధ పోరాటం ద్వారానే స్వాతంత్ర్యం వస్తుందని నమ్మి దాని కోసం ప్రాణాలర్పించిన యోధుడని కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో అల్లూరి సీతారామరాజు 125 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు కేవలం 27 ఏళ్ల ప్రాయంలోనే నిరుపేద అమాయకులైన అనుచరులతో, చాలా పరిమితమైన వనరులతో బ్రిటిష్ సామ్రాజ్యమనే మహా శక్తిని ఢీకొట్టాడన్నారు. అల్లూరి అంకుఠిత సాహసం, త్యాగ దీక్ష, ఏకాగ్రతలు నేటి యువత నేర్చుకొని స్ఫూర్తిని పొందాలన్నారు. అల్లూరి సీతారామరాజు స్వయంగా జాతీయోద్యమంలో పాల్గొన్న వ్యక్తి అని అన్నారు. జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ ఎస్.శ్రీధర్ మాట్లాడుతూ విప్లవ యోధుడు అల్లూరి సీతారామరాజు తెలుగు బిడ్డని, ఆయన దేశ భక్తి, త్యాగనిరతి, ధైర్య సాహసాలు నిరుపమానమని, మన్యం ప్రజల కష్టాలు తీర్చడానికి పోరాటానికి దిగారని అన్నారు. డీఆర్‌ఓ సీహెచ్ సత్తిబాబు, కలెక్టరేట్ పరిపాలనాధికారి కాశి విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

అమలాపురం ఆర్టీసీ డిపో అభివృద్ధికి ప్రణాళిక
7న ఉన్నతాధికారుల బృందం రాక

అమలాపురం రూరల్: జిల్లా కేంద్రం అమలాపురం ఆర్టీసీ బస్ స్టేషన్, డిపో అభివృద్ధికి ఓ ప్రణాళిక రూపొందించారు. దాదాపు రూ.కోటి వ్యయంతో ఈ బస్ స్టేషన్, డిపోను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ సూచనల మేరకు ప్రణాళిక సిద్ధమైంది. ఈ నెల 7వ తేదీన అమలాపురం ఆర్టీసీ డిపోను రాష్ట్ర ఆర్టీసీ ఇంజినీరింగ్ ఉన్నతాధికారుల బృందం సందర్శించి ఆ అభివృద్ధికి అవసరమైన పనులకు సంబంధించి అంచనాలు సిద్ధం చేయనుంది. ఇందుకోసం మంత్రి విశ్వరూప్ విజయవాడలోని తన మంత్రిత్వ శాఖ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ఆర్టీసీ ఉన్నతాధికారుల సమావేశంలో ఈ ప్రణాళిక గురించి చర్చించారు. ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావు అధ్యక్షతన జరిగిన ఉన్నతాధికారుల సమావేశంలో అమలాపురానికి ఈ నెల 7న అధికారుల బృందాన్ని పంపించాలని నిర్ణయించారు. ఈ విషయాన్ని మంత్రి విశ్వరూప్ విజయవాడ నుంచి ఫోన్ చేసి చెప్పారు. అమలాపురం ఆర్టీసీ బస్ స్టేషన్‌ను ఓ ఆదర్శవంతమైన స్టేషన్‌గా మలిచేందుకు ఈ ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి విశ్వరూప్ తెలిపారు. వర్షం వస్తే బస్ స్టేషన్‌లో నీరు నిలిచిపోతున్న దుస్థితిని కూడా దూరం చేస్తూ మొత్తం రూపురేఖలు మారేలా అభివృద్ధి చేయనున్నామని చెప్పారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు కూడా పాల్గొన్నారు.

పలు భాషా చిత్రాల్లో నటిస్తున్నా
సినీ నటుడు సుమన్



పుల్లేటికుర్రులో సుదర్శన హోమం చేస్తున్న సినీ నటుడు సుమన్

అంబాజీపేట: ఫ్యాక్షనిజంకు ముగింపు పలకాలనే లక్ష్యంతో సిద్దప్ప గట్టు చిత్రంలో లీడ్ రోల్‌లో మనో దర్శకత్వంలో నటిస్తున్నానని సినీనటుడు సుమన్ తెలిపారు. పుల్లేటికుర్రులో వేంచేసియున్న శ్రీ చౌడేశ్వరి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం సుమన్ సుదర్శన హోమం చేశారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పురుషులతో సమానంగా స్త్రీలు వ్యాపార, ఉద్యోగ రంగాల్లో ముందుండాలని, మహిళలు కత్తులు, తుపాకీలు చేతపట్టకూడదనే సందేశాత్మక చిత్రం చేస్తున్నామన్నారు. అనంతపురంలో జరిగిన నిజ జీవిత కథ (బయోపిక్) ఆధారంగా ప్రసాద్ దర్శకత్వంలో చెంగప్ప చిత్రం చేస్తున్నామన్నారు. ఓ కాలేజీలో చదివిన విద్యార్థి అదే కాలేజీకి ప్రిన్సిపాల్‌గా రావడం, ఆయనకు ఎదురైన ఘటనల ఇతివృత్తంగా సినిమా చేస్తున్నామని చెప్పారు. తమిళం, కన్నడం, ఒరియా వంటి పలు భాషల సినిమాల్లో నటిస్తున్నానన్నారు. ఏ శుభకార్యాలు, దైవదర్శనాలు, పనులు చేపట్టాలన్నా దైవానుగ్రహం ఉండాలని సుమన్ తెలిపారు.

పంట బీమాపై ఇదేం కడుపు మంట

- పారదర్శకంగా ఆర్బీకేల్లో పంట బీమా జాబితాలు
- సీజన్ ముగియకుండానే పంపిణీకి ఏర్పాట్లు
- ఖాతాల్లో ఏటా రూ.10 కోట్ల నుంచి రూ.20 కోట్లు
- వరుసగా నాలుగేళ్లుగా పంటల బీమా పరిహారం
- రైతులకు వెగటు పుట్టిస్తోన్న పచ్చమీడియా విషపు రాతలు



రామచంద్రపురం మండలం నెలపర్తిపాడులో గత రబీలో పంట నష్టం అంచనా వేస్తున్న అధికారులు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై విషం కక్కడమే పనిగా పెట్టుకున్న ఎల్లో మీడియా రోజు రోజుకీ పేట్రేగిపోతోంది. ఉచితానుచితాలను పాటించకుండా, పాత్రికేయ ప్రమాణాలను పట్టించుకోకుండా తన పచ్చ పైత్యాన్ని చూపిస్తోంది. రైతు పక్షపాతిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జనంలో ఉన్న మంచిపేరును చూసి ఓర్వలేక అక్షరాల్లో తన కడుపు మంటను బయట పెట్టుకుంటోంది.

సాక్షి ప్రతినిధి, కాకినాడ: సాగుచేసిన ప్రతి ఎకరాకు ఈ క్రాప్ ఆధారంగా పంట బీమా వర్తింప చేస్తోన్న ఏకైక రాష్ట్రం మనదే. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం ద్వారా అర్హత ఉన్న ప్రతి రైతుకూ భరోసాగా ఆర్థిక లబ్ధి చేకూరుస్తోంది. ఇటువంటి పథకంపై కూడా పచ్చమీడియా రాస్తున్న విషపు రాతలు రైతులకు వెగటు పుట్టిస్తున్నాయి. ఏ సీజన్‌లో జరిగిన నష్టానికి ఆ సీజన్ ముగియకుండానే నాలుగేళ్లుగా ప్రభుత్వం పంట బీమా అందజేస్తూ రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తోంది. పంట నష్ట పరిహారం అందలేదనే మాట రాకుండా శాఖల సమన్వయంతో దీనిని పారదర్శకంగా అమలు చేస్తున్నారు. పంట నష్టం, పరిహార వివరాలను గణాంకాలతో సహా రైతు భరోసా కేంద్రాల్లో సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నారు. గ్రామ సభల ద్వారా అభ్యంతరాలు స్వీకరించాకే తుది జాబితాలు ప్రదర్శిస్తున్నారు. ఎలాంటి జాప్యం లేకుండా పారదర్శకంగా సకాలంలో పంట బీమా చెల్లిస్తున్నా వాస్తవాలను దాచిపెట్టి ఈనాడు విషపు రాతలతో రైతుల్లో అయోమయాన్ని సృష్టిస్తోంది. పంట బీమా పథకంపై బురద జల్లుతోంది. అవాస్తవాలను ప్రచారం చేస్తున్న తీరును రైతు ప్రతినిధులు ఆక్షేపిస్తున్నారు.

ఫ్యాక్ట్ చెక్

చంద్రబాబు హయాంలో

చంద్రబాబు హయాంలో నష్టం అంచనాలంటూ, పునర్విచారణ అంటూ నెలల తరబడి కాలయాపన చేసింది. రైతులను గాలికి వదిలేసింది. నష్టం అంచనాల జాబితాలో రైతుల పేర్లు రావాలంటే స్థానికంగా త్రుణమో ఫలమో చేతిలో పెట్టక తప్పడం లేదంటూ నాడు రైతులు లబోదిబోమనేవారు. అప్పుడు ఒక ఏడాది పంట బీమా పరిహారం ఒకటి, రెండు సీజన్‌లు దాటినా అందితే గొప్పే అన్నట్టుగా ఉండేది. అదీ కూడా క్షేత్ర స్థాయిలో అవినీతికి పరాకాష్టగా మారిన జన్మభూమి కమిటీల కమీషన్‌లు దాటి రావాల్సి వచ్చేది. తెలుగు తమ్ముళ్లు కమీషన్లు పోనూ అరకొరగా చేతిలో పెట్టి చేతులు దులుపేసుకునే వారు. పంట నష్ట పరిహారం అందుకోవడం అంటే పెద్ద సవాల్‌గా నిలిచేదని నాటి పరిస్థితులను రైతులు ఇప్పటికీ గుర్తుకు తెచ్చుకుంటున్నారు. ఇలా అడుగడుగునా పంటల బీమాను దోచుకుని రైతులను నట్టేటముంచేసినప్పుడు ఈనాడు రాతలు ఏమయ్యాయని వారు ప్రశ్నిస్తున్నారు.

ఖరీఫ్ సీజన్‌లో అందింది ఇలా..

సంవత్సరం	రైతులు	రూ.కోట్లలో
2019-20	6,762	రూ.0.42
2020-21	63,843	రూ.78.81
2021-22	80,736	రూ.231.66
త్వరలో ఇవ్వనున్న పరిహారం		
2022-23	15,279(వరి)	రూ. 9.99
	13,407 (అరటి)	రూ. 10.45
మొత్తం		రూ.20.44

సకాలంలో పరిహారం



గత ఖరీఫ్‌లో మూడెకరాలలో వరి సాగు చేశాను. వాతావరణం అనుకూలించక చాలా నష్టపోయాను. మళ్లీ పంట వేయడం ఎలా అనుకుంటున్న తరుణంలో బీమా వస్తుందంటే ఆశగా ఎదురు చూశాను. దిగుబడి ఆధారిత కొలమానం ప్రకారం మూడెకరాలకు రూ.47.500 బీమా వచ్చింది. అధికారులు వెంటనే నష్టం అంచనా వేయడంతో బీమా సొమ్ము అందింది.

మారిశెట్టి వెంకటేశ్వరరావు, సీహెచ్ గున్నేపల్లి, ముమ్మిడివరం మండలం


నష్టపోయిన ప్రతి రైతుకూ..



ఈ క్రాప్ జాబితాలను మాత్రమే ప్రామాణికంగా తీసుకుని పంట బీమా వర్తింప చేస్తున్నాం. కొత్తగా ఎవరి పేర్లు తీసేయలేదు, నమోదు చేయలేదు. పంట నష్టం జరిగితే వాస్తవ దిగుబడి, హామీ దిగుబడి అనే వ్యత్యాసాలను చూసి పరిహారం చెల్లిస్తుంటారు. లబ్దిదారుల జాబితాలపై అభ్యంతరాలను ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 4వ తేదీ లోపు స్వీకరించాం.

– హిమాన్షు శుక్లా, కలెక్టర్, కోనసీమ జిల్లా

టీడీపీ సర్కారు ఎగనామం



వ్యవసాయం దండగన్న చంద్రబాబు తాను ముఖ్యమంత్రిగా ఉండగా అందుకు తగ్గట్టుగానే రైతుల ప్రయోజనాలకు పాతరేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని రైతులకు పంటల బీమా పరిహారాన్ని ఏళ్ల తరబడి ఇవ్వకుండా జాప్యం చేశారు. రైతులను నానా ఇబ్బందులకు గురిచేశారు. 2014-2015లో ప్రకృతి విపత్తుతో వరి సహా ఇతర పంటలకు జరిగిన నష్టాన్ని అంచనా వేసినా బీమా అందజేతలో నిర్లక్ష్యం చేశారు. ఆ సీజన్లో ప్రకృతి విపత్తుతో నష్టపోయిన 25వేల మంది రైతులకు రూ.13 కోట్లు బీమా పరిహారం పంపిణీ చేయకుండా దాటేశారు. రైతులు ఎక్కే మెట్టు, దిగే మెట్టు అన్నట్టుగా కాళ్లరిగేలా తిరిగారు. చివరకు పెద్ద ఆందోళనలు చేస్తే రెండేళ్ల తరువాత అంటే 2017లో ఆ సొమ్మును దశలవారీగా రైతు ఖాతాలకు జమ చేశారు. 2016-17లో కూడా తుపానులతో వరి పంట దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా 18వేల మందికి బీమాగా రూ.9 కోట్లు మంజూరైంది. సకాలంలో అందజేయకుండా రైతులను ఇబ్బందుల పాల్జేశారు. ఈ మొత్తం కోసం తిరిగి, తిరిగి రైతులు అలసిపోయి ఆశలు వదులుకున్నారు. చంద్రబాబు సర్కార్ 18 వేల మంది రైతుల నోట మట్టికొట్టింది. బీమా సొమ్ము జమ చేయకుండా ఎగనామం పెట్టింది.

8న బీమా పరిహారం జమ

నాలుగేళ్లుగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పంటలకు జరిగిన నష్టం, రైతులకు అందుకున్న పంటల బీమాను పరిశీలిస్తే ప్రభుత్వం ఎంత పారదర్శకంగా పరిహారాన్ని అందిస్తుందో అర్థమవుతుంది. 2022-23 ఖరీఫ్ సీజన్ పంట నష్టానికి రైతులకు అందించేందుకు బీమా సొమ్ము సిద్ధమైంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అభ్యంతరాల స్వీకరణ గడువు మంగళవారంతో ముగిసింది. అన్ని పరిశీలించి ఈ నెల 8న రైతు దినోత్సవం సందర్భంగా రైతులకు అందజేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. తొలిసారి అరటి పంటకు ప్రభుత్వం బీమా సౌకర్యం కల్పించింది. వరితో పాటు ఇతర పంటలకు బీమా చెల్లించనున్నారు.

అవసరం కనుక్కొని మరీ సేవలందించే ప్రభుత్వమిది



జగనన్న సురక్ష లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న మంత్రి వేణు

జగనన్న సురక్ష కార్యక్రమంలో మంత్రి వేణు

రామచంద్రపురం రూరల్: ప్రజల అవసరాలు కనుక్కొని వారి ఇంటికే వెళ్లి సేవలు అందించే విధంగా రాష్ట్రంలో జగనన్న ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణు గోపాలకృష్ణ అన్నారు. గతంలో ప్రజలు ప్రభుత్వ సేవలు పొందేందుకు కాళ్లకు బలపం కట్టుకుని తిరిగే పరిస్థితి ఉండేదన్నారు. రామచంద్రపురం మండలం జగన్నాయకులపాలెంలో మంగళవారం మంత్రి వేణు జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ వలంటీరు, గ్రామ సచివాలయ వ్యవస్థలను ఏర్పాటు చేసి ప్రభుత్వ సేవలను ప్రజల చెంతకు చేర్చిన ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. మీకు మంచి చేస్తేనే నాకు మళ్లీ ఓటు వెయ్యండని దేశ రాజకీయ చరిత్రలోనే మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే ప్రజలను కోరుతున్నారని, ఆయన చిత్తశుద్ధికి ఇదే నిదర్శనమన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు, జెడ్పీటీసీ సభ్యుడు మేర్నీడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీలు నరాల రాజ్యలక్ష్మి, శాకా బాబీ, గ్రామ సర్పంచ్, వైఎస్సార్ సీపీ పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు అనిశెట్టి రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు బళ్ల సుధాకరరావు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాసరావు, డీఎల్‌డీఓ ఎ.శాంతి, తహసీల్దార్ పి. తేజేశ్వరరావు పాల్గొన్నారు.

సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు

- ఓఎన్‌జీసీ ఈడీ అమిత్ నారాయణ్ అంగీకారం
- ఎంపీ అనురాధ



ఎంపీ అనురాధకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఈడీ అమిత్‌నారాయణ్

అల్లవరం: అమలాపురం పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులు చేపట్టడానికి సీఎస్ఆర్ నిధులు మంజూరు చేయడానికి రాజమహేంద్రవరం ఓఎన్‌జీసీ ఈడీ అమిత్‌నారాయణ్ అంగీకరించారని ఎంపీ అనురాధ తెలిపారు. మొగళ్ళమూరులోని ఎంపీ కార్యాలయంలో ఈడీ అమిత్‌నారాయణ్ ఎంపీ అనురాధని మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ అనురాధ మాట్లాడుతూ కలెక్టర్ ద్వారా మాత్రమే సీఎస్ఆర్ నిధులు మంజూరు చేయాలని ఈడీ అమిత్‌కు సూచించారు. జిల్లావ్యాప్తంగా తాగునీరు, ఆరోగ్య పరమైన పనులకు నిధులు కేటాయించాలని, ఆర్‌డీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో కంప్యూటర్లు, స్కానర్లు, తదితర ఎలక్ట్రానిక్ పరికరాలను ఏర్పాటు చేయడానికి నిధులు కేటాయించటానికి, గన్నవరం నియోజకవర్గంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో ఐదు ఓహెచ్ఆర్ ట్యాంకుల నిర్మాణానికి ఈడీ అంగీకారం తెలిపారు. బీసీ, ఎస్సీ హాస్టల్‌లో ఇటీవల సీఎస్ఆర్ నిధులతో కంప్యూటర్లు మంజూరు చేశారని ఎంపీ తెలిపారు. జిల్లాల్లో పలు అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు చేయగా 80 శాతం పనులకు ఓఎన్‌జీసీ ఈడీ అమిత్ అంగీకారం తెలిపారన్నారు. ఓఎన్‌జీసీ కార్యకలాపాలు నిర్వహించే ప్రదేశాల్లో కొంతమంది వాహనాలను అడ్డుకుని ఇబ్బంది పెడుతున్నారని ఈడీ అమిత్.. ఎంపీ అనురాధ దృష్టికి తీసుకొచ్చారు. వాహనాలను అడ్డుకుంటే రోజుకు రూ.30 లక్షలు నష్టం వాటిల్లుతుందని ఈడీ తెలిపారు. ఓఎన్‌జీసీ కార్యకలపాలకు ప్రజల నుంచి ఇబ్బంది రాకుండా చూడాలని ఎంపీని ఈడీ కోరారు. దీనిపై ఎంపీ అనురాధ స్పందిస్తూ రాజమండ్రి ఓఎన్‌జీసీ ఆసెట్, కాకినాడ ఓఎన్‌జీసీ ఆసెట్ ఆధ్వర్యంలో జిల్లాలో పలు అభివృద్ధి పనులకు రూ. 7 కోట్లు వెచ్చించారని అన్నారు. ఓఎన్‌జీసీ కార్యకలపాలతో ఎవరికైనా ఇబ్బంది ఉంటే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని, అంతేగాని వాహనాలను అడ్డుకోవడం సరైన నిర్ణయం కాదని ఎంపీ సూచించారు.

పబ్లిక్ న్యూసెన్స్ చేస్తున్న మరో 60 మందిపై కేసులు

అమలాపురం టౌన్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి పబ్లిక్ న్యూసెన్స్ చేస్తున్న మరో 60 మందిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేసినట్లు అమలాపురం డీఎస్పీ ఎం.అంబికాప్రసాద్ తెలిపారు. పోలీసు సబ్ డివిజన్‌లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న వారిపై స్పెషల్ డ్రైవ్ కొనసాగుతోందన్నారు. తొలిరోజు డివిజన్‌లో 38 కేసులు నమోదు చేస్తే రెండో రోజు సోమవారం సాయంత్రం నుంచి రాత్రి వరకూ నిర్వహించిన నిఘాలో మరో 60 మందిని గుర్తించి కేసులు నమోదు చేశామని చెప్పారు. అమలాపురం పట్టణ, రూరల్, ముమ్మిడివరం సీఐలు డి.దుర్గాశేఖరరెడ్డి, పి.వీరబాబు, ఎస్.కొండయ్య ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ జరుగుతున్నాయని డీఎస్పీ అంబికా ప్రసాద్ తెలిపారు.

సమయం ఆదా.. తగ్గిన వ్యధా

- బెంగాలీ కూలీలతో వరి నాట్లకే ప్రాధాన్యం
- రోజుకు నాలుగైదు ఎకరాల్లో పని పూర్తి



వరినాట్లు వేస్తున్న బెంగాలీ కూలీలు

రాయవరం: సాధారణంగా మహిళలే వరి నాట్లు వేయడాన్ని చూస్తుంటాం. కానీ పురుషులు..అదీ ఇతర రాష్ట్రం నుంచి వలస వచ్చిన కూలీలు వరి నాట్లు వేస్తుండగా రైతులు వీరి కోసం క్యూ కడుతున్నారు. తక్కువ సమయంలో..తక్కువ ఖర్చుతో ఎక్కువ ఎకరాల్లో వరినాట్లు వేస్తుండడంతో స్థానిక రైతుల నుంచి ఆదరణ లభిస్తోంది. సాధారణంగా ఖరీఫ్‌లో రైతులు సాధారణ వరినాట్ల వైపే మొగ్గు చూపుతుంటారు. ఇటీవల కాలంలో అధిక శాతం రైతులు వెదజల్లు, బెంగాలీ కూలీలతో వరి నాట్లకే ప్రాధాన్యమిస్తున్నారు.

జిల్లా అంతటా..

ముందస్తు సాగులో భాగంగా జూన్ ఒకటో తేదీన కాలువలకు సాగునీరు విడుదల చేశారు. అంతకు ముందుగానే బోర్లపై సాగుచేసే రైతులు కూడా వరి నారుమడులను సిద్ధం చేశారు. వ్యవసాయ పనుల ప్రారంభం కాగానే ఈ ప్రాంతానికి చెందిన కొందరు దళారీలు బెంగాల్ కూలీలను రప్పించడం ప్రారంభించారు. ఇంచుమించుగా జిల్లాలోని ప్రతీ గ్రామంలో బెంగాలీ కూలీలు ఉన్నారు. వీరికి స్థానికంగా ఉన్న రైతులు ఆశ్రయం కల్పిస్తున్నారు.

జిల్లాలో పరిస్థితి ఇదీ..

గతేడాది ఖరీఫ్‌లో 1,35,227 ఎకరాల్లో వరి నాట్లు వేయగా, 31,102 ఎకరాల్లో వెదజల్లు విధానంలో వరిసాగు చేపట్టారు. 52,063 ఎకరాల్లో రైతులు సాధారణ పద్ధతిలో వరినాట్లు వేయగా, 52,063 ఎకరాల్లో బెంగాలీ కూలీలతో వేసినట్లుగా వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారం తెలుస్తోంది. ఈ ఏడాది సాధారణ పద్ధతిలో చేపట్టే వరినాట్లతో 50 శాతం మేర బెంగాలీ కూలీలతో వరినాట్లు వేస్తారని వ్యవసాయ శాఖ అధికారులు లెక్కలు వేస్తున్నారు.

పెరిగిన గిరాకీ

మన ప్రాంతంలో బెంగాలీ కూలీలకు మంచి గిరాకీ ఉంది. 10 మంది బెంగాలీ కూలీలు ప్రతి రోజు నాలుగు ఎకరాల విస్తీర్ణంలో వరినాట్లు వేస్తారు. ఒక ఎకరం భూమిలో వరినాట్లు వేసేందుకు ఎకరానికి రూ.4వేలు తీసుకుంటున్నారు. వారే నారును తీసుకుని, వారే వరి నాట్లు వేసుకుంటున్నారు. పొలంలో తాడు కట్టి వరుస పాటిస్తూ నాట్లు వేస్తుండడంతో వరి దుబ్బు బాగా కట్టి దిగుబడులు బాగుంటున్నాయి. అనుకూలిస్తే రోజుకు ఐదెకరాల్లో కూడా వరి నాట్లు వేస్తున్నారు. వీరు తక్కువ వరి నారును వినియోగించడంతో ఆ ఖర్చు కూడా రైతుకు ఆదా అవుతోంది. అదే స్థానికంగా ఉన్న కూలీలతో వరి నాట్లు వేయించాలంటే రైతుకు అదనంగా రూ.4,500 ఖర్చు అవుతుంది. ఒక ఎకరం పొలంలో వరినాట్లు వేయడానికి తొమ్మిది మంది మహిళా కూలీలు అవసరమవుతున్నారు. ఒక్కో మహిళా కూలీకి రోజుకు రూ.500 కూలి అవుతుంది. ఈ లెక్కన వరి నాట్లు వేయడానికి రూ.4,500 ఖర్చవుతుంది. వరి నారు తీయడానికి ఐదుగురు మగ కూలీలు అవసరమైతే, వారికి ఒక్కక్కరికి రోజుకు రూ.800 వంతున రూ.4వేలు ఖర్చవుతుంది. ఈ లెక్కన ఒక ఎకరం చేలో వరినాట్లకు రూ.9,500 వెచ్చించాల్సి వస్తోంది. అదే బెంగాలీ కూలీలతో వరి నాట్లు వేయిస్తే రూ.4,500 ఆదా అవ్వడంతో స్థానిక రైతులు బెంగాలీ కూలీలనే ఆశ్రయిస్తున్నారు.

ఓ పక్క వంట..మరో పక్క నాట్లు

పశ్చిమ బెంగాల్ నుంచి వచ్చిన 10/20 మంది కూలీలు బ్యాచ్‌లుగా ఉంటారు. వారు తమ వెంట బియ్యం, నిత్యావసరాలు, గ్యాస్ ఇతరత్రా సామగ్రి తెచ్చుకుంటారు. ఉదయమే వరి నాట్ల పని ప్రారంభిస్తారు. ఓ పక్క కూలీలు నాట్లు వేస్తుండగా, ముఠాలోని ఒకరు వంటను సిద్ధం చేస్తారు. దీంతో కూలీలు దఫదఫాలుగా భోజనం చేస్తూనే, మరో పక్క వరి నాట్లు వేస్తుండడంతో రోజు గడిచే సరికి నాలుగు నుంచి ఐదెకరాల్లో వరి నాట్లు పూర్తవుతుండడంతో రైతుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. 20 రోజులుగా జిల్లాలో వరి నాట్లు వేస్తున్నారు. ఒక్క ఖరీఫ్ సీజన్ ముగిసే లోపు ఖర్చులు పోగా ఒక్కొక్కరూ రూ.35వేల వరకు సంపాదించే అవకాశముందని బెంగాలీ కూలీలు చెబుతున్నారు.

అక్కడ పనులు లేకనే..



మేము పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని ఘాజీపూర్ నుంచి వచ్చాం. అక్కడ పనులు లేకనే ఈ ప్రాంతానికి వరి నాట్లు వేయడానికి వచ్చాం. పదిమంది కలసి ఒక చోట ఉంటున్నాం. మా ప్రాంతం నుంచి వేలాది మంది వరి నాట్లు వేసేందుకు వచ్చాం.

– మనోజ్ అధికారి, బెంగాలీ కూలీ

ఉపాధి దొరుకుతోంది



ఖరీఫ్, రబీ సీజన్లో ఈ రాష్ట్రానికి వరి నాట్లు వేసేందుకు వస్తున్నాం. ఇక్కడ రైతుల నుంచి ఆదరణ లభిస్తోంది. ఈ ప్రాంతంలో వరి నాట్లు పూర్తవ్వగానే వరి నాట్లు వేసేందుకు అవకాశమున్న మరో ప్రాంతానికి మమ్మల్ని తీసుకుని వెళ్తన్నారు.

– బిషు బైన్, బెంగాలీ కూలీ

ఖర్చు బాగా తగ్గుతుంది



స్థానికంగా కూలీల కొరత, ఖర్చును అధిగమించడానికి బెంగాలీ కూలీల వల్ల వీలవుతోంది. నేను ఐదెకరాల్లో వరి నాట్లను బెంగాలీ కూలీలతో వేయించాను. ఖర్చు బాగా కలసి వచ్చింది.

– కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, కౌలు రైతు, పసలపూడి, రాయవరం మండలం

క్లుప్తంగా

ఏడిదలో చిట్‌ఫండ్ వ్యాపారి పరారీ

సుమారు రూ.రెండు కోట్లకు టోకరా?

మండపేట: మండలంలోని ఏడిదలో చిట్‌ఫండ్ వ్యాపారి కుటుంబంతో సహా పరారవ్వడం చర్చనీయాంశంగా మారింది. దాదాపు రూ.1.5 కోట్ల మేర తన వద్ద చిట్టీలు వేసిన వారికి టోకరా పెట్టినట్టు తెలుస్తోంది. పదేళ్ల క్రితం చిట్‌ఫండ్ ప్రారంభించిన ఆ వ్యాపారి రూ.రెండు లక్షలు, రూ.మూడు లక్షలు, రూ.ఐదు లక్షలు, రూ.10 లక్షల చిట్‌లు నిర్వహిస్తున్నాడు. తన పేరిట ఉన్న ఇల్లు, స్థలంను ఇటీవల తన వాళ్ల పేరిట రిజిస్ట్రేషన్ చేయించి రెండు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి కుటుంబంతో సహా పరారైనట్టు గ్రామస్తులు అంటున్నారు. అతని వద్ద 80 మందికి పైగా బాధితులు సుమారు రూ.రెండు కోట్ల మేర మోసపోయినట్టు ప్రచారం జరుగుతోంది. ఏడిదతో పాటు మండపేటలోను అతని బాధితులు ఉన్నట్టు సమాచారం. ఈ విషయమై రూరల్ ఎస్‌ఐ బి.శివకృష్ణను సంప్రదించగా తమకు ఫిర్యాదు ఏమీ అందలేదన్నారు. బాధితుల నుంచి ఫిర్యాదు అందితే దర్యాప్తు చేస్తామన్నారు.

7న 'నన్నయ'లో క్యాంపస్ ప్లేస్‌మెంట్

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో కెమిస్ట్రీ, ఫార్మసీ విద్యార్థులకు ఈ నెల 7న క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ జరుగనుందని వీసీ ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. హైదరాబాద్‌లోని పెట్రో గ్రూప్స్‌లో కంట్రోల్, క్వాలిటీ ఎసెస్మెంట్, ప్రొడక్షన్ విభాగాలలో ఉద్యోగాలకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఈ ఉద్యోగాలకు వేతనం ఏడాదికి రూ.2.92 లక్షల నుంచి రూ. 3.06 లక్షలు ఉంటుందన్నారు.

బీఎస్సీ కెమిస్ట్రీ, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, బి.ఫార్మసీ పూర్తి చేసి 26 సంవత్సరాలలోపు వయస్సు ఉన్నవారు వీటికి అర్హులన్నారు. ఆసక్తి, అర్హత ఉన్నవారు అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలు, నాలుగు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో హాజరుకావాలని వీసీ తెలిపారు. ప్లేస్‌మెంట్ డ్రైవ్ కోఆర్డినేటర్‌గా డాక్టర్ బి.జగన్‌మోహన్‌రెడ్డి వ్యవహరిస్తారని అన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు

అంబాజీపేట: తండ్రితో ఏటీఎంకు వచ్చిన మహిళ అదృశ్యం అయ్యింది. అంబాజీపేట పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అమలాపురం రూరల్ మండలం పాలగుమ్మికి చెందిన ఓ వివాహితకు భర్తతో ఏర్పడిన విభేదాల కారణంగా విడాకులు తీసుకుని అదే గ్రామానికి చెందిన తన తండ్రి సుబ్బారావు ఇంటిలో తన కుమార్తెతో పాటు నివాసం ఉంటుంది. అయితే ఈ నెల 3వ తేదీన ముక్కామల ఎస్‌బీఐ ఏటీఎం వద్దకు తన తండ్రి సుబ్బారావుతో కలిసి ఆ వివాహిత వచ్చింది. ఏటీఎంలో డబ్బు తీసుకుని వెనక్కి తిరిగే చూసేసరికి తన కుమార్తె కనిపించలేదని, తండ్రి సుబ్బారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ వై.సూర్యనారాయణ తెలిపారు.

మండపేటలో చోరీ

రూ.6.52 లక్షల సొత్తు అపహరణ



చిందరవందరగా పడివున్న బీరువాలోని చీరలు

మండపేట: పట్టణంలోని శెట్టిబలిజ కల్యాణ మంటపం వీధిలోని ఒక ఇంటిలో జరిగిన చోరీలో రూ.6.52 లక్షల విలువైన నగదు, బంగారం, వెండి వస్తువులు అపహరణకు గురైనట్టు గుర్తించారు. స్థానిక శెట్టిబలిజ కల్యాణ మంటపం వీధికి చెందిన వస్త్ర వ్యాపారి ఏఎం లక్ష్మీనారాయణ రెండు రోజుల క్రితం ఇంటికి తాళం వేసుకుని కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లో తన బావమరిది రిటైర్‌మెంట్ వేడుకకు వెళ్లారు. సోమవారం ఉదయం అతని ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటంతో చుట్టుపక్కల వారు గమనించి వారికి సమాచారం అందించిన విషయం విదితమే. మంగళవారం ఉదయం మండపేట చేరుకున్న లక్ష్మీనారాయణ పోలీసులకు సమాచారం అందించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. క్లూస్ టీం వచ్చి వేలిముద్రలు సేకరించింది. ఇంటిలోని వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. దొంగలు బీరువా తాళాలు పగులగొట్టి అందులోని దుస్తులను బయట పడేశారు. బీరువాలో ఉంచిన రూ.70,000 నగదు, 271 గ్రాముల బంగారు వస్తువులు, నాలుగు కేజీల వెండి వస్తువులు మాయమైనట్టు లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులు గుర్తించారు. మొత్తం చోరీకి గురైన సొత్తు విలువ రూ.6.52 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

విచ్చుకోనున్న పచ్చదనం



పుర్వాభాద్ర నక్షత్రం పేరుతో ఏర్పాటు చేసిన మామిడి మొక్క



శ్రవణం నక్షత్రం పేరుతో ఏర్పాటు చేసిన జిల్లేడు మొక్క



జేఎన్‌టీయూకేలో ఏర్పాటు చేసిన నక్షత్ర వనం

- జేఎన్‌టీయూకేలో నక్షత్ర వనానికి నాంది
- ప్రతి మొక్క వద్ద స్కానింగ్ కోడ్
- సరికొత్త పర్యావరణ ప్రాజెక్టుకు పునాది
- 2021-22కు గ్రీన్ క్యాంపస్ ఎకో స్కోర్ 53 శాతం సాధించిన వర్సిటీ

బాలాజీచెరువు: నగర నడిమధ్యలో దాదాపు 70 ఎకరాలకు పైబడి ఉన్న జేఎన్‌టీయూ కాకినాడ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణ నేడు పర్యావరణ ప్రాజెక్టుకు పునాదిగా మారుతోంది. కళాశాల నుంచి వర్సిటీగా అప్‌గ్రేడ్ అయి విశాలమైన స్థలంతో దానికి తగిన వనరులు అందుబాటులో ఉన్ననాడు నిర్లక్ష్యం చేశారు. ఉన్న స్థలాన్ని వనరులను సద్వినియోగం చేసి నేడు దానికి ప్రాణం పోస్తున్నారు. జేఎన్‌టీయూ కాకినాడ యూనివర్సిటీలో 2010లో నక్షత్ర వనం పేరుతో దాదాపు ఎకరానికి పైగా స్థలంలో మొక్కలు నాటడానికి ప్రణాళిక రూపొందించి శంకుస్థాపన చేశారు. కానీ అది పూర్తి స్థాయిలో కార్యరూపం దాల్చలేదు. దాదాపు 12 సంవత్సరాల పాటు ఆ ప్రాంతం నిరుపయోగంగా ఉంది. దీనిపై ప్రస్తుత వీసీ డాక్టర్ ప్రసాదరాజు దృష్టి పెట్టి నక్షత్ర వనానికి మళ్లీ జీవం పోశారు. ఇప్పటికే వర్సిటీలో మియావాకీ ప్లాంటేషన్ పేరుతో 2020 మొక్కలు నాటి మినీ అడవి ఏర్పాటు చేయగా, ప్రిన్సిపాల్ కార్యాలయం పక్కన జంగిల్ బుక్ పేరుతో మొక్కల మధ్యలో పాఠ్యాంశాలు బోధించేలా ఏర్పాటు చేశారు. తాజాగా పర్యావరణానికి సంబంధించి ఇటీవల ఏర్పాటు చేసిన నక్షత్ర వనం ఆకట్టుకుంటోంది. కళాశాల పూర్వ విద్యార్థి రేఖపల్లి శ్రీనివాసరావు ఆర్థిక చేయూతతో మరింతగా తీర్చిదిద్దుతున్నారు. 2021-22కు గాను ఆడిటింగ్‌లో గ్రీన్ క్యాంపస్ ఎకోస్కోర్ 53 శాతం పొందింది.

గ్రీన్ క్యాంపస్ దిశగా అడుగులు



వర్సిటీలో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని గ్రీన్ క్యాంపస్ ఏర్పాటు చేయడమే లక్ష్యంగా పర్యావరణానికి సంబంధించి పలు రకాల ప్రాజెక్టులు చేపడుతున్నాం. మొక్కలతో మనుషులకు ఉండే అనుబంధాన్ని తెలియజేయడానికి జన్మ నక్షత్రం పేరిట మొక్కలను నాటాం. ఆ విధంగా తమ నక్షత్రం పేరిట మొక్కలు నాటి విద్యార్థులు పర్యావరణానికి పాటుపడతారనే ఉద్దేశంతో ఈ విధంగా చేశాం. పలు కొత్త కార్యక్రమాలు చేపట్టి వాటిలో విద్యార్థులను భాగస్వాములను చేసి పర్యావరణంపై అవగాహన కల్పిస్తున్నాం. అనుబంధ కళాశాలల్లో 75 సంవత్సరాలు పైబడి ఉన్న వృక్షాలకు పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రకటించిన ఏడాదికి రూ.2,500 పింఛన్‌కు స్పందన వచ్చింది. అర్హత గల వాటికి పింఛన్ ఇస్తున్నాం.

– డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు, వీసీ జేఎన్‌టీయూకే

నక్షత్ర వనం అంటే...

మనిషి పుట్టిన సమయాన్ని బట్టి జన్మ నక్షత్రం ఉంటుంది. అశ్విని, భరణి, కృత్తిక, రోహిణి, మృగశిర వంటి 27 నక్షత్రాలకు నాలుగేసి పాదాలు ఉంటాయి. ఆ విధంగా 27 నక్షత్రాలకు 108 పాదాలకు 108 మొక్కలను ప్రత్యేక మైన ప్రాంతంలో ఏర్పాటు చేశారు. ప్రతి మొక్క వద్ద దానికి సంబంధించిన వివరాలు రాసి అక్కడ క్యూఆర్ బోర్డు ఏర్పాటు చేశారు. ఆ క్యూఆర్‌ను స్కాన్ చేస్తే మొక్క రకం, ఆ జన్మ నక్షత్ర రాశివారి గుణగుణాలు, వారి స్వభావం వంటి సమాచారం లభిస్తుంది.

ఘనంగా మోదకొండమ్మ ఉత్సవాలు



అమ్మవారి ఆలయం వద్దకు బోనాలను నెత్తిన పెట్టుకుని వెళుతున్న వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి



అమ్మవారి ఆలయం వద్ద గల బోనాలను పరిశీలిస్తున్న విజయలక్ష్మి తదితరులు

- బోనాలిచ్చిన ఆడపడుచులు
- వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు విజయలక్ష్మి

మధురపూడి: కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలో ఆడపడుచులు గ్రామ దేవత మాతృశ్రీ మోదకొండమ్మ వారికి బోనాలు సమర్పించడం మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. ఉత్సవాలను మంగళవారం విజయలక్ష్మి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. తొలుత అమ్మవారిని దర్శించుకున్న ఆమె రాజానగరం నియోజకవర్గంలోని ప్రజలు, రైతులకు ఆయురారోగ్యాలు, సుఖశాంతులివ్వాలని కోరుకున్నారు. విజయలక్ష్మి విలేకర్లతో మాట్లాడుతూ ఎక్కడెక్కడో ఉన్న ఆడపడుచులంతా ఆషాఢం సందర్భంగా గ్రామానికి చేరుకుని, అమ్మవారికి బోనాలను సమర్పించడం సంతోషం అన్నారు. అమ్మవారి సంరక్షణలో శ్రీరంగపట్నం వాసుల అభివృద్ధి జరుగుతోందన్నారు.

భక్తి భావాన్ని పెంపొందించిన బోనాల ప్రదర్శన

శ్రీరంగపట్నం ఆడపడుచులు మంగళవారం అమ్మవారి జాతర ప్రారంభం సందర్భంగా అత్తెసర, ముద్దపప్పు ఆహార పదార్థాలతో పాటు బియ్యంతో కూడిన మట్టి కుండలను అమ్మవారి ఆలయం ముందు ఉంచారు. ఈ పదార్థాలను అమ్మవారు ఆరగిస్తారన్న నమ్మకంతో ఇలా చేస్తారు. ఆడపడుచులందరూ ఈ బోనాలను నెత్తిపై ఉంచుకుని ఊరంతా తిరుగుతారు. అనంతరం అమ్మవారికి సమర్పిస్తారు.

వారం రోజుల పాటు నిర్వహణ

అమ్మవారి ఉత్సవాలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు నిర్వహిస్తారు. మంగళవారం శ్రీ బాలగౌరీ కళా బృందం ఆధ్వర్యంలో భక్తి రంజని కార్యక్రమం జరిగింది. సర్పంచ్ మద్దాల పెద్ద అమ్మాజీ, వైఎస్సార్ సీపీ నాయకులు మద్దాల రమణ, కొయిడాల నానాజీ, సూరిశెట్టి అప్పలస్వామి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అందివస్తాడనుకుంటే..అనంత లోకాలకు

- పశ్చిమలో జరిగిన ప్రమాదంలో పసలపూడి యువకుడు మృతి
- విషాదంలో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు



పోతంశెట్టి వెంకట బసివిరెడ్డి (ఫైల్)



బసివిరెడ్డి మృతితో రోదిస్తున్న కుటుంబ సభ్యులు

రాయవరం: చిన్న కుటుంబం..చింతలేని కుటుంబం. తల్లిదండ్రులు, అక్కాబావలు, బంధుమిత్రులతో నెల రోజుల క్రితమే ఆ యువకుడికి వివాహ నిశ్చితార్థం జరిగింది. మరో రెండు నెలల్లో వివాహం చేసేందుకు ముహూర్తాలు కూడా నిశ్చయించుకున్నారు. అందరూ ఆనందంగా ఉన్న సమయంలో ఆ యువకుడిపై విధి చిన్న చూపు చూసింది. పశ్చిమగోదావరి జిల్లా పెనుమంట్ర వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందడం కుటుంబంలో కోలుకోని విషాదాన్ని నింపింది. కుమారుడు తమకు అందివస్తున్నాడనుకుంటున్న తరుణంలోనే అనంతలోకాలకు వెళ్లడంతో తల్లిదండ్రులకు పుట్టెడు శోకాన్ని మిగిల్చింది. అందరికీ తలలో నాలుకలా ఉండే ఆ యువకుడి మృతి గ్రామస్తులను కూడా కలచివేసింది. రాయవరం మండలం పసలపూడిలో చోటు చేసుకున్న విషాద ఘటనకు సంబంధించిన వివరాలివీ..

గ్రామానికి చెందిన పోతంశెట్టి వెంకటబసివిరెడ్డి(23) వ్యాపారం నిమిత్తం మంగళవారం పశ్చిమగోదావరి జిల్లా భీమవరం వెళ్తున్నాడు. పెనుమంట్ర మండలం ఆలమూరు సమీపంలో లారీ రూపంలో మృత్యువు మింగేసింది. ఇద్దరు కుమార్తెల తర్వాత పుట్టిన బసివిరెడ్డిని తల్లిదండ్రులు సత్యనారాయణరెడ్డి, బుల్లెమ్మాయిలు అపురూపంగా చూసుకుంటున్నారు. నెల రోజుల క్రితం బసివిరెడ్డికి వివాహాన్ని నిశ్చయించి, నిశ్చయ తాంబూలాలు కూడా ఇచ్చుకున్నారు. సెప్టెంబరు 7వ తేదీన వివాహం చేసేందుకు నిర్ణయించుకున్నారు. రెండు నెలల్లో బసివిరెడ్డి ఇంటి వాడు కావాల్సి ఉండగా, రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు అనంతలోకాలకు తీసుకుపోవడంతో తల్లిదండ్రులు హతాశులయ్యారు. వ్యాపారం చూసుకుని ఇంటికి వస్తాడని భావిస్తున్న తరుణంలో రోడ్డు ప్రమాదంలో కుమారుడు మృతి చెందాడన్న పిడుగులాంటి వార్తతో తల్లిదండ్రులు బుల్లెమ్మాయి, సత్యనారాయణరెడ్డి, అక్కలు వెంకట రమాదేవి, లావణ్యల రోదనలతో ఆ ప్రాంతమంతా విషాద వాతావరణం నెలకొంది. భగవంతుడా..ఎంత పనిచేశావంటూ తల్లి బుల్లెమ్మాయి బోరున విలపించింది. మేమేం పాపం చేశామని ఇంత శిక్ష విధించావంటూ కన్నీరుమున్నీరయ్యారు.

విజిలెన్స్ దాడులు

పెద్ద ఎత్తున నిషేధిత సిగరెట్లు సీజ్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): నిషేధిత పొగాకు ఉత్పత్తుల విక్రయాలకు సంబంధించి విశ్వసనీయ సమాచారం మేరకు రీజనల్ విజిలెన్స్ ఇన్‌చార్జి ఎస్పీ కె.కుమార్ ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ దుకాణాలపై మంగళవారం విజిలెన్స్ దాడులు నిర్వహించారు. రెవెన్యూ శాఖ, లీగల్ మెట్రాలజీ అధికారులు, కమర్షియల్ టాక్స్ అధికారులతో కలిసి సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. రాజమహేంద్రవరం నల్లమందు సెంటర్‌లోని ఎంఎస్ శ్రీయ జనరల్ స్టోర్స్‌లో నిషేధిత సిగరెట్ ప్యాకెట్లను గుర్తించారు. వీటి విలువ రూ.1.54,875 ఉంటుంది. మొత్తం 3,025 ప్యాకెట్ల బ్రాండెడ్ కాని నిషేధిత సిగరెట్ ప్యాకెట్లను స్వాధీనపర్చుకొని, షాపు యజమాని దిట్టకుర్తి సత్యనారాయణపై క్రిమినల్ కేసు నమోదు చేసి మూడో పట్టణ పోలీసులకు అప్పగించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ భవనం సమీపంలోని ఆకులవారి వీధిలోని మేఘనా ఎంటర్‌ప్రైజెస్ గోడౌన్లో నిషేధిత సిగరెట్ ప్యాకెట్లను గుర్తించారు. వీటి విలువ రూ.3,98,450గా గుర్తించారు. మొత్తం 84,450 నిషేధిత సిగరెట్లను స్వాధీన పర్చుకున్నారు. టౌన్‌హాలు రోడ్డులో సత్య మణికంఠ జనరల్ మర్చంట్లో రూ.38, 275 విలువైన 180 సిగరెట్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై క్రిమినల్ కేసు నమోదు చేసి ఒకటో పట్టణ పోలీసులకు అప్పగించారు. తనిఖీల్లో డీఎస్పీ ముత్యాలునాయుడు, కార్యాలయ ఇన్‌స్పెక్టర్లు సత్యకిషోర్, రమేష్, శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ అధికారి భార్గవ మహేష్, జియాలజిస్ట్ లక్ష్మీనారాయణ, తహసీల్దార్ విజయ్ కుమార్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

అల్లూరి స్ఫూర్తితో ముందుకు



అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు

కాకినాడ సిటీ: అల్లూరి సీతారామరాజు అంటే తెలియని తెలుగు వారే లేరని, ఆయన ఆశయాలు, స్ఫూర్తితో ప్రజలందరూ ముందుకు వెళ్లాలని జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు అన్నారు. జిల్లా పరిషత్‌లో అల్లూరి సీతారామరాజు 127వ జయంతి ఉత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. వేణుగోపాలరావు అల్లూరి పోరాట స్ఫూర్తిని, దేశభక్తిని కొనియాడుతూ ఆ మహనీయుని సదా స్మరించుకోవాలన్నారు. జెడ్పీ సీఈవో ఎ.రమణారెడ్డి మాట్లాడుతూ జాతి మొత్తం సీతారామరాజును గుండెల్లో చిరస్మరణీయంగా గుర్తించుకున్నారన్నారు. రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించారని, తెలుగువారిలో విప్లవ జ్యోతిని రగిలించి మన్యం ప్రజల దోపిడీని అరికట్టిన చిరస్మరణీయుడని కొనియాడారు. పంచాయతీరాజ్ మినిస్టీరియల్ సిబ్బంది అధ్యక్షుడు ఆర్‌వీవీ రమేష్, జెడ్పీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ డ్రైవర్లుగా రాణించాలి



శిక్షణ పొందిన అభ్యర్థులతో డీపీటీఓ షర్మిల అశోక, డిపో మేనేజర్ షేక్ షబ్నం

రాజమహేంద్రవరం సిటీ: ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో హెవీ డ్రైవింగ్ శిక్షణ పొందిన అభ్యర్థులు భవిష్యత్తులో వృత్తి నిబద్ధతతో ఉత్తమ డ్రైవర్లుగా రాణించాలని ఆర్టీసీ డీపీటీఓ షర్మిల అశోక పిలుపునిచ్చారు. మంగళవారం ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ శిక్షణ తొమ్మిదో బ్యాచ్ ముగింపు సందర్భంగా శిక్షణ పొందిన 16 మంది అభ్యర్థులకు సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ డ్రైవర్లు శిక్షణ తరగతులలో నేర్చుకున్న డ్రైవింగు మెళకువలను ప్రదర్శించి సమాజంలో సుశిక్షిత డ్రైవరుగా గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. ఇప్పటి వరకూ 150 మంది డ్రైవర్లు శిక్షణ పొందగా వారిలో 120 మందికి పైగా జీవనోపాధి పొందారన్నారు. త్వరలో 10వ బ్యాచ్ ప్రారంభ కానున్నదని ఆసక్తి గల అభ్యర్థులు అడ్మిషన్ల కోసం డ్రైవింగ్ శిక్షకులు వీఎస్ఎల్‌రావు 7382112678ను సంప్రదించాలన్నారు. రాజమహేంద్రవరం డిపో మేనేజరు షేక్ షబ్నం, శిక్షకులు వీఎస్ ఎల్ రావు పాల్గొన్నారు.

శాకంబరిగా మరిడమ్మ



పెద్దాపురం : మరిడమ్మ అమ్మవారు మంగళవారం శాకంబరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక దర్గా సెంటర్ లక్కీ షాపింగ్ మాల్ యాజమాన్యం సహకారంతో మరిడమ్మ అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు, పండ్లతో వేద పండితులు అలంకరించారు. పెద్దాపురం సీఐ అబ్దుల్ నబీ పర్యవేక్షణలో బందోబస్తు కల్పించారు. అనంతరం వీధి సంబరాల్లో భాగంగా కుమ్మరవీధి సంబరాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రామ్మోహనరావు, ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు



గుత్తుల పద్మ

అమలాపురం రూరల్: తాండవపల్లి గ్రామానికి చెందిన వివాహిత మహిళ గుత్తుల పద్మ అదృశ్యంపై అమలాపురం తాలూకా పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పద్మ వయసు 42 సంవత్సరాలు. మంగళవారం తెల్లవారుజాము నుంచి కనిపించడం లేదని శానపల్లిలంకకు చెందిన తల్లి గూడాల నాగ జెమున పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తాలూకా ఎస్‌ఐ అందే పరదేశి తెలిపారు. ఆమె ఆచూకీ ఎవరికైనా తెలిసిన వెంటనే అమలాపురం తాలూకా పోలీస్‌లకు తెలియచేయాలని కోరారు.

అక్రమంగా బియ్యం తరలిస్తున్న ముగ్గురిపై కేసు

కొవ్వూరు: పట్టణంలో గామన్ ఇండియా బ్రిడ్జి జంక్షన్‌లో మంగళవారం తెల్లవారు జామున అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం లారీ పట్టుకున్నామని సీఎస్‌డీటీ జి.బాపిరాజు తెలిపారు. రాజమహేంద్రవరం వైపు వెళుతున్న మినీలారీలో 12 టన్నుల బియ్యం తరలిస్తున్నారని అన్నారు. బియ్యానికి ఏవిధమైన రసీదులు లేవన్నారు. అక్రమంగా తరలిస్తున్న లారీని స్వాధీనం చేసుకుని డ్రైవర్ పి.వేణురెడ్డిపై ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కేసులో గోల్లప్రోలుకి చెందిన బియ్యం యాజమాని పెద్దిరెడ్డి రామచంద్రరావు, లారీ యజమాని పడాల సూర్యరావుపై ఫిర్యాదు చేశారన్నారు. పట్టణ ఎస్సై బి.దుర్గాప్రసాద్ కేసు నమోదు చేశారు.

రైల్వే స్టేషన్‌లో గంజాయి పట్టివేత



పట్టుబడ్డ గంజాయితో నిందితుడు

కాకినాడ క్రైం: కాకినాడ పోర్టు రైల్వే స్టేషన్‌లో పార్సిల్ ఆఫీస్ సమీపంలో ఓ వ్యక్తి నుంచి 40 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని రైల్వే ఎస్‌ఐ రవికుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాజమహేంద్రవరం రైల్వే డీఎస్ఆర్‌పి నాగేశ్వరరావు, సీఐ రామారావు సహా ఉన్నతాధికారులకు అందిన సమాచారం మేరకు, వారిచ్చిన ఆదేశాలకు అనుగుణంగా ముమ్మర తనిఖీలు చేశామని ఆయన తెలిపారు. నిందితుడిని కోర్టుకు తరలించామని మంగళవారం రాత్రి ఓ ప్రకటనలో పేర్కొన్నారు.